## కిషన్‌రెడ్డి యాత్రకు రాజాసింగ్ డుమ్మా!

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ): బీజేపీ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆ పార్టీ కార్యక్రమానికి మళ్లీ డుమ్మా కొట్టారు. కొన్నాళ్లుగా ఆయన పార్టీ కార్యక్రమాల్లో పెద్దగా పాల్గొనకపోగా, బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మంగళవారం గోషామహల్‌లో నిర్వహించిన విజయ సంకల్ప రథయాత్రకూ ఆయన హాజరుకాలేదు. ఈ విషయంలో ఆ పార్టీతోపాటు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ సాగుతున్నది. వాస్తవానికి యాత్రకు మొదటి నుంచీ రాజాసింగ్ దూరంగానే ఉంటున్నారు. ఇప్పుడు ఏకంగా కిషన్‌రెడ్డి ర్యాలీకి డుమ్మా కొట్టడంతో రాష్ట్ర నాయకత్వానికి, రాజాసింగ్‌కు మధ్య పూడ్చలేనంత దూరం పెరిగిందని శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి. ఇదిలా ఉండగా విద్వేషపూరిత వ్యాఖ్యల నేపథ్యంలో ఆయనపై సస్పెన్షన్ వేటు వేసినప్పటి నుంచే మనస్థాపం చెందినట్టు చెప్తున్నారు. వరుసగా మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచిన తనకు పార్టీలో సరైన ప్రాధాన్యం దక్కడం లేదని తన సన్నిహితుల దగ్గర వాపోయినట్టు సమాచారం. బీజేఎల్పీ నేతగా మహేశ్వర్‌రెడ్డిని నియమించడం, ఎల్పీలో ఎలాంటి పదవీ అప్పగించకపోవడంతో తీవ్రంగా మనస్థాపం చెందినట్టు చెప్పుకుంటున్నారు. ఇదే సమయంలో ఎంపీ టికెట్ అడిగితే పార్టీ ససేమిరా అనడంతో కూడా ఆయన అలిగినట్టు చెప్తున్నారు. దీంతో ఆ పార్టీ కార్యక్రమాలకు దాదాపుగా దూరం అయ్యారు.



ఈఎస్ఐకి తరలించిన కిడ్నీతో శస్త్రచికిత్స నిర్వహించిన వైద్యుల బృందం

## ఈఎస్ఐ చరిత్రలో మొదటి కిడ్నీ మార్పిడి

- విజయవంతంగా నిర్వహించిన సనత్‌నగర్ దవాఖాన

అమీర్‌పేట్, ఫిబ్రవరి 27: ఈఎస్ఐ దవాఖానల చరిత్రలో మొట్టమొదటిసారిగా మూత్రపిండాల మార్పిడి శస్త్రచికిత్స నిర్వహించారు. జీవన్‌దాన్ కార్యక్రమంలో భాగంగా సనత్‌నగర్ ఈఎస్ఐసీ సూపర్ స్పెషాలిటీ దవాఖానలో బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి నుంచి సేకరించిన మూత్రపిండాన్ని డయాలిసిస్‌పై ఉన్న రోగికి అమర్చారు. ఈ ఆపరేషన్ తరువాత రోగి కోలుకుంటున్న నేపథ్యంలో ఈఎస్ఐ వైద్యులు మంగళవారం మీడియాతో మాట్లాడారు. కిడ్నీ మార్పిడి ఆపరేషన్‌కు నేతృత్వం వహించిన డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ పాండు రంగరావు, డాక్టర్ ధనలక్ష్మి మాట్లాడుతూ బీమాదారుడు (రోగి) శ్రీరాజ్‌కుమార్ కిడ్నీలు పాడవడంతో గత నాలుగేండ్లుగా డయాలిసిస్‌పై జీవనం సాగిస్తున్నాడని తెలిపారు. ఈ నెల 21న ఉస్మానియా దవాఖానలో ఓ వ్యక్తి బ్రెయిన్‌డెడ్ అయినట్టు అక్కడి వైద్యులు నిర్ధారించడంతో జీవన్‌దాన్ సంస్థ అతడి కిడ్నీని ఈఎస్ఐసీ సనత్‌నగర్‌కు కేటాయించింది. దీంతో ఈఎస్ఐసీ నెఫ్రాలజీ విభాగం వైద్య నిపుణులు డాక్టర్ కార్తీక్, న్యూరాలజీ విభాగం డాక్టర్ సందీప్ ఆ కిడ్నీని సనత్‌నగర్ ఈఎస్ఐసీకి తరలించారు. కాగా అప్పటికే డాక్టర్ జగదీశ్వర్ నేతృత్వంలో విజయవంతంగా కిడ్నీ మార్పిడి ఆపరేషన్ పూర్తి చేశారు. కిడ్నీని అమర్చిన రోగి క్రమంగా కోలుకుంటున్నారని, క్రియాటిన్ కూడా అదుపులోకి వస్తున్నదని, మూత్ర విసర్జన కూడా పూర్వ స్థితికి చేరుతున్నదని, అతి తొందరలోనే శ్రీరాజ్‌కుమార్‌కు డయాలిసిస్ అవసరం తప్పుతుందని వైద్యులు తెలిపారు.



రాములపల్లిలో పరస్పరం దాడి చేసుకొంటున్న బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, అడ్డుకొంటున్న పోలీసులు



కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లిలో ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులను అదుపులోకి తీసుకొంటున్న పోలీసులు

# కాంగ్రెస్, బీజేపీ తన్నులాట

- 'బండి'ని అడ్డుకునేందుకు యత్నం
- ప్రజాహిత యాత్రలో నెలకొన్న ఉద్రిక్త వాతావరణం
- రంగంలోకి దిగిన పోలీసులు

హుస్నాబాద్/చిగురుమామిడి/చొప్పదండి, ఫిబ్రవరి 27: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ చేపట్టిన ప్రజాహితయాత్ర మంగళవారం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యాలు చేశారంటూ సిద్దిపేట, కరీంనగర్ జిల్లాల్లో ప్రజాహిత యాత్రను అడ్డుకునేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు ప్రయత్నించారు. పలు చోట్ల కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు నడిరోడ్డుపై తన్నుకున్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం రాములపల్లి గ్రామంలోకి ప్రజాహితయాత్ర ప్రవేశించగానే.. బండి గ్యోబాక్ అంటూ కాంగ్రెస్ కార్యకర్తలు నినాదాలు చేశారు. దిష్టిబొమ్మలు దహనం చేశారు. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో కాంగ్రెస్ కార్యకర్తకు తీవ్రగాయాలయ్యాయి. బీజేపీ యాత్రపై కొందరు ఆగంతకులు రాళ్లు విసిరారు. పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్న పోలీసులు కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయడంతో వివాదం సద్దుమణిగింది. హుస్నాబాద్ పట్టణంలో ఏర్పాటుచేసిన బీజేపీ ఫ్లెక్సీలను ధ్వంసం చేశారు. ఇరువర్గాలు పరస్పరం పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు చేశాయి.

కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లిలోనూ బండి సంజయ్ యాత్ర సందర్భంగా ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. బొమ్మనపల్లిలో సంజయ్ బస చేసిన క్యాంపును ముట్టడించేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు ప్రయత్నించగా, బీజేపీ నాయకులు తీవ్రంగా ప్రతిఘటించారు. కరీంనగర్ రూరల్ ఏసీపీ వెంకటరమణ, సిద్దిపేట పోలీసుల ఆధ్వర్యంలో అక్కడికి చేరుకున్న పోలీసులు కాంగ్రెస్ నాయకులను అదుపులోకి తీసుకొని ఠాణాకు తరలించారు. మరోవైపు క్యాంపునకు వెళ్తున్న బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొమ్మ శ్రీరామ్ చక్రవర్తిని పోలీసులు అడ్డుకున్నారు. పరిస్థితి సద్దుమణిగిన తర్వాత పోలీసులు అనుమతించడంతో యాత్ర యథావిధిగా సాగింది.

కరీంనగర్ జిల్లా చిగురుమామిడిలోని బస్టాండ్ వద్ద కాంగ్రెస్ మండల శాఖ ఆధ్వర్యంలో ఎంపీ బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అంతకుముందు ఉల్లంపల్లి, హుస్నాబాద్ రహదారి మధ్య సంజయ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేసి ఆందోళన చేపట్టారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని ఠాణాకు తరలించారు. కాగా, సంజయ్‌పై చర్యలు తీసుకోవాలంటూ చిగురుమామిడి, హుస్నాబాద్, చొప్పదండి, గన్నేరువరం, రుద్రంగి తదితర పోలీస్‌స్టేషన్లలో కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేశారు. వేములవాడ పట్టణంలోనూ, శంకరపట్నం మండల కేంద్రంలోని కరీంనగర్-వరంగల్ రహదారిపై బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

## రేవంత్‌ను దించేందుకు పొన్నం కుట్ర

- అల్లర్లు సృష్టించడం అందులో భాగమే
- ఉద్దేశపూర్వకంగానే కాంగ్రెస్ కార్యకర్తలను రెచ్చగొడుతున్న మంత్రి ప్రభాకర్
- కరీంనగర్‌లో కాంగ్రెస్ ఓడితే మంత్రి పదవి వదులుకుంటావా?
- ప్రజాహితయాత్రలో బీజేపీ ఎంపీ బండి సంజయ్



హుస్నాబాద్, ఫిబ్రవరి 27: రాష్ట్రంలో లేనిపోని అల్లర్లు సృష్టించి సీఎం రేవంత్‌రెడ్డిని గద్దె దించి, మరొకరిని కుర్చీ ఎక్కించేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ కుట్ర చేస్తున్నారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మంత్రి పొన్నం దుందుడుకు చర్యలు, ప్రతి చిన్న విషయానికి కార్యకర్తలను రెచ్చగొట్టి అల్లర్లు సృష్టించడాన్ని బట్టి చూస్తే ఇలాంటి అనుమానాలే కలుగుతున్నాయని చెప్పారు. పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి నియామకం తరువాత ఆయనపై పొన్నం ఎన్నో విమర్శలు చేశారని గుర్తుచేశారు. ప్రజాహిత యాత్రలో భాగంగా సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో జరిగిన సభలో బండి సంజయ్ మాట్లాడుతూ.. తాను చేసిన వ్యాఖ్యలకు తప్పుడు అర్థాలను ఆపాదించుకొని కాంగ్రెస్ కార్యకర్తలను రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధి పొందేందుకు పొన్నం ప్రభాకర్ ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. నిరుద్యోగులు, గౌరవెల్లి రిజర్వాయర్ నిర్వాసితులు, రైతుల కోసం ఉద్యమించిన చరిత్ర తనదని, పొన్నంకు ఏ చరిత్ర ఉన్నదో చెప్పాలని డిమాండ్ చేశారు. కరీంనగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి గెలిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని, ఒకవేళ ఓడిపోతే పొన్నం మంత్రి పదవిని, రాజకీయాలను వదులుకుంటాడా? అని సవాల్ విసిరారు.

## సంజయ్ ఒళ్లు దగ్గర పెట్టుకో

- నా తల్లి గురించి, నా జన్మ గురించి మాట్లాడటం ఎంత వరకు సమంజసం?
- బండి సంజయ్ వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం



కరీంనగర్, 27 ఫిబ్రవరి (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/హుస్నాబాద్: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ నాలుక, ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. నియోజకవర్గం అభివృద్ధిపై తాను అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక బండి సంజయ్.. తన తల్లి గురించి, తన జన్మ గురించి నీచమైన వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. వీటిని బీజేపీ జాతీయ, రాష్ట్ర నాయకులు సమర్థిస్తారా? అని ప్రశ్నించారు. ఎంపీ బండి సంజయ్ వ్యాఖ్యలకు కౌంటర్‌గా మంగళవారం ఆయన ఒక వీడియోను విడుదల చేయడమే కాకుండా సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో ఓటమి భయంతోనే బండి సంజయ్ రాజకీయ డ్రామాలకు తెరలేపుతున్నారని, ఆయన యాత్రను తామేదో అడ్డుకుంటున్నట్టుగా ప్రచారం చేసుకొంటున్నారని పొన్నం విమర్శించారు. శ్రీరాముడి గురించి మాట్లాడే బీజేపీ నాయకులు తల్లి గురించి, జన్మల గురించి మాట్లాడటమేమిటని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందేందుకు బండి సంజయ్ కుట్రలకు తెరలేపుతున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నటికీ హింసను ప్రేరేపించదని స్పష్టంచేశారు. శ్రీరాముడి పేరిట ఓట్లు అడగడం కాదు.. ఎంపీగా చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని సవాల్ విసిరారు. బండి యాత్రను తాము అడ్డుకోవడం లేదని మంత్రి పొన్నం తెలిపారు.

## బీజేపీకి ఓటేయకపోతే నరకానికే

### ఎంపీ అర్వింద్ వ్యాఖ్యలు

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 27: బీజేపీకి ఓటు వేయకుంటే నరకానికి పోతారని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బాల్కొండ నియోజకవర్గంలో మంగళవారం నిర్వహించిన భీమ్ విజయ్ సంకల్ప యాత్రలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణతో కలిసి అర్వింద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్వింద్ మాట్లాడుతూ.. మహిళా సంఘాలకు మోదీ ప్రభుత్వం రుణాలిస్తుందని, ఎన్నో పథకాలను అమలు చేస్తున్నదని చెప్పారు. బీజేపీ పెట్టిన తిండి తిని ఓటు వేయని వారు నరకానికి పోతారని అన్నారు. తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వెంటనే హామీలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. 'రాహుల్ ప్రధాని అయ్యేది లేదు.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేసేది లేదు' అని డీకే అరుణ ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లాకో వ్యవసాయ కళాశాల

### వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

హైదరాబాద్, ఫిబ్రవరి 28(నమస్తే తెలంగాణ): ఉమ్మడి జిల్లాకు ఒక వ్యవసాయ కాలేజీ చొప్పున ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. నిజామాబాద్ జిల్లా రుద్రూర్, నల్లగొండ జిల్లాలోని కంపసాగర్‌లో వ్యవసాయ కళాశాలల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంపు లక్ష్యంలో కనీసం 20 శాతం కూడా చేరుకోని కంపెనీలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా గబ్బగుర్తి గ్రామంలో ఏర్పాటు చేయనున్న ఆయిల్‌పామ్ సీడ్ గార్డెన్ ఏర్పాటును త్వరగా పూర్తిచేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



నిజాం కాలం నాటి పెట్రోల్ పంప్ ఇది. జూబిలీహిల్స్‌లోని కాసు బ్రహ్మానందరెడ్డి (కేబీఆర్) పార్కులో కొన్నేండ్లుగా పడి ఉంది. హైదరాబాద్ నిజాం ప్రభువు వాహనాలకు పెట్రోలు పోసేందుకు ఈ ప్రైవేటు పంప్‌ను ఏర్పాటు చేసినట్టు చారిత్రక ఆధారాలు వెల్లడిస్తున్నాయి. ప్రతిరోజు ఎంతోమంది ఉదయం ఈ పార్కుకు వాహ్యాళికి వస్తున్నా.. రాజు అల్లూరి అనే వ్యక్తి ఇటీవల దీనిని గుర్తించారు. డివిజనల్ అటవీ అధికారి రూపొందించిన పార్కు మేనేజ్‌మెంట్ ప్లాన్ ఆధారంగా ఆ పంప్ నేపథ్యాన్ని కనుగొన్నారు.

## సాఫ్ట్‌వేర్ కంపెనీ సీఈవో ఆత్మహత్య

అమీన్‌పూర్, ఫిబ్రవరి 27: సాఫ్ట్‌వేర్ కంపెనీ సీఈవో ఆత్మహత్య చేసుకున్న ఘటన సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. అమీన్‌పూర్ ఎస్సై ఈవీ రమణ వివరాల ప్రకారం.. అమీన్‌పూర్‌లోని దుర్గా హోమ్స్ ఫేజ్-2 విల్లా లో ఉండే కొల్లాటి కాశీ విశ్వనాథ్ (38) మాదాపూర్‌లో ఎక్లాట్ ప్రైమ్ అనే సాఫ్ట్‌వేర్ కంపెనీ ఏర్పాటు చేసి దానికి సీఈవోగా పనిచేస్తున్నారు. 6 నెలల కిందట అదే కంపెనీని అమెరికాలో ఏర్పాటు చేయాలని అక్కడికి వెళ్లారు. కంపెనీ ఏర్పాటు కుదరక పోవడంతో తిరిగొచ్చి, తీవ్ర మనస్తాపం చెందారు. మంగళవారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో తన ఇంట్లోని కిటికీ కి చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు.. విశ్వనాథ్ మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి భార్య వినీల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొన్నారు.

## ఆత్మకూరు ఎస్సైపై సస్పెన్షన్ వేటు

- బీఆర్ఎస్ నేతలపై చేయిచేసుకొన్నందుకు చర్యలు
- వరంగల్ సీపీ ఉత్తర్వులు జారీ
- బాధ్యులపై చర్యలకు చల్లా డిమాండ్



చల్లా ధర్మారెడ్డి

వరంగల్, ఫిబ్రవరి 27(నమస్తే తెలంగాణ ప్రతినిధి): హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం అగ్రంపహాడ్ జాతరలో 'జై తెలంగాణ' నినాదాలు చేసిన బీఆర్ఎస్ నాయకులపై చేయిచేసుకున్న ఆత్మకూరు ఎస్సై జీ ప్రసాద్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ మేరకు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర కిశోర్ ఝా మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. జాతరలో జై తెలంగాణ నినాదాలు చేసిన 12 మంది బీఆర్ఎస్ నాయకులను పరకాల ఏసీపీ, ఆత్మకూరు సీఐ, ఎస్సై కలిసి ఈ నెల 24న అర్ధరాత్రి ఇండ్ల నుంచి బలవంతంగా వరంగల్‌లోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి తరలించి ఇష్టం వచ్చినట్టు దాడిచేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో వరంగల్ ఈస్ట్‌జోన్ డీసీపీ అబ్దుల్ బారీతో విచారణ జరిపించారు. నివేదిక ఆధారంగా తాజాగా ఆత్మకూరు ఎస్సైని సస్పెండ్ చేశారు. ఈ ఘటనతో సంబంధం ఉన్న సీఐ ఆర్ సంతోష్, పరకాల ఏసీపీ కిశోర్ కుమార్ పాత్రపై నివేదికలో ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. ఈ మొత్తం ఘటనలో ఎస్సైని మాత్రమే బాధ్యుడిని చేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై దాడిచేసిన ఎస్సైని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ బుధవారం 'చలో ఆత్మకూరు' కార్యక్రమాన్ని తలపెట్టింది. తాజాగా ఎస్సైని సస్పెండ్ చేయడంతో ఈ కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. ఎస్సైపై చర్యలతో సరిపెట్టడం కాదని, బాధ్యులందరిపైనా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

### ఏం జరిగిందంటే?

అగ్రంపహాడ్ జాతరలో సమ్మక్క-సారలమ్మ దర్శనార్థం ఈ నెల 23న మాజీ ఎమ్మెల్యే చల్లా దంపతులు వచ్చారు. అదే సమయంలో ఎమ్మెల్యే రేవూరి దర్శనం చేసుకుంటుండడంతో పోలీసులు గద్దెల గేట్లను మూసివేశారు. ఆ తర్వాత గేట్లు తెరవడంతో చల్లాతోపాటు బీఆర్ఎస్ నాయకులు జై తెలంగాణ నినాదాలు చేస్తూ తల్లుల దర్శనం చేసుకున్నారు. వారు ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలిగించకున్నా అక్కడ విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌తో ఫిర్యాదు చేయించి ఈ నెల 24న అర్ధరాత్రి దాటాక ఆత్మకూరు, దామెర మండలాలకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులను పోలీసులు బలవంతంగా స్టేషన్‌కు తీసుకెళ్లారు. వారిపై 143, 149, 353 వంటి సెక్షన్ల కింద కేసు నమోదు చేసి వరంగల్ టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి తీసుకెళ్లి ఇష్టంవచ్చినట్టు దాడిచేశారు. దుస్తులు ఊడదీసి, బూతులు తిడుతూ విచక్షణ రహితంగా కొట్టారు. అనంతరం పరకాల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జరిగిన ఘటనపై వారు చల్లాకు వివరించగా, ఆయన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, బాధితులతో కలిసి వరంగల్ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన విచారణ జరిపించి బాధ్యుడైన ఆత్మకూరు ఎస్సై ప్రసాద్‌ను సస్పెండ్ చేశారు.

## నేటి నుంచి రాష్ట్రంలో మండేఎండలు

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో బుధవారం నుంచి ఉష్ణోగ్రతలు పెరుగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించింది. రెండు నుంచి మూడు డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరగనున్నట్టు వెల్లడించింది. మార్చి రెండో వారం నుంచి ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయని పేర్కొన్నది. మరోవైపు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశమూ ఉన్నదని తెలిపింది. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు 33 డిగ్రీలు, రాత్రి 20 డిగ్రీలుగా నమోదైంది. రాష్ట్రంలో గాలులు గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీస్తున్నాయి. పశ్చిమ తెలంగాణలో వేడి ఎక్కువగా ఉంటుందని, హైదరాబాద్‌లోనూ ఎండలు అధికంగానే ఉన్నట్టు వాతావరణ శాఖ తెలిపింది. వచ్చే ఐదురోజుల పాటు రాయలసీమలో వేడి వాతావరణం ఉంటుందని తెలిపింది.




| జిల్లా | ఉష్ణోగ్రతలు |
|---|---|
| ఆదిలాబాద్ | 35.8 |
| భద్రాచలం | 37 |
| హనుమకొండ | 33.5 |
| హైదరాబాద్ | 33.7 |
| ఖమ్మం | 35.8 |
| మహబూబాబాద్ | 35.6 |
| మెదక్ | 34.2 |
| నల్లగొండ | 34 |
| నిజామాబాద్ | 35.6 |
| రామగుండం | 34.4 |

## పలువురు ఐఎఫ్ఎస్ అధికారుల బదిలీ

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం అటవీశాఖలోని ఎనిమిది మంది ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) అధికారులను బదిలీ చేసింది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

| అధికారి | ప్రస్తుత స్థానం | బదిలీ అయిన స్థానం |
|---|---|---|
| 1. షఫీఉల్లా | వెయిటింగ్ | పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధిశాఖ ప్రత్యేక కమిషనర్ |
| 2. ప్రియాంక వర్గీస్ | సీసీఎఫ్, ఆర్‌డీ సర్కిల్ | సీసీఎఫ్ (ఐటీ, డబ్ల్యూపీ) |
| 3.ఎస్‌జే ఆశ | తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ అకాడమీ డైరెక్టర్ | ములుగు ఫారెస్ట్ కాలేజీ డీన్ (అదనపు బాధ్యతలు) |
| 4. డాక్టర్ ప్రభాకర్ | వెయిటింగ్ | కాళేశ్వరం సర్కిల్, సీసీఎఫ్ |
| 5. టీ రవికిరణ్ | మహబూబాబాద్ డీఎఫ్‌వో | మీ సేవ, కమిషనర్ |
| 6. అపర | వరంగల్, డీఎఫ్‌వో | డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, పీసీసీఎఫ్ |
| 7. అనూజ్ అగర్వాల్ | ఏటూరునాగారం, ఎఫ్‌డీవో | వరంగల్, డీఎఫ్‌వో |
| 8. విశాల్ బత్తుల | అమ్రాబాద్, ఎఫ్‌డీవో | మహబూబాబాద్, డీఎఫ్‌వో |

## పీఎం సూర్య ఘర్ బిజిలీకి రాష్ట్రం సహకరించాలి

- తెలంగాణ సోలార్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్‌కుమార్

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ): కేంద్రం ప్రకటించిన పీఎం సూర్య ఘర్ ఉచిత సోలార్ విద్యుత్తు పథకానికి రాష్ట్ర ప్రభుత్వం కూడా సబ్సిడీ ఇవ్వాలని తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ అధ్యక్షుడు బీ అశోక్‌కుమార్ కోరారు. దీనివల్ల సోలార్ విద్యుదుత్పత్తి గణనీయంగా పెరుగుతుందని, తద్వారా రాష్ట్రంలో లక్షలాది విద్యుత్తు వినియోగదారులకు మేలు కలుగుతుందని చెప్పారు. హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో మంగళవారం పీఎం సూర్య ఘర్ బిజిలీ యోజన అమలుపై జరిగిన సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందిన సోలార్ యూనిట్ల కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. వారికి ఈ సందర్భంగా అశోక్‌కుమార్ పథకంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను ఇచ్చారు. పునరుత్పాదక ఇంధన వనరుల ఉత్పత్తిని పెంచేందుకు సోలార్ విద్యుదుత్పత్తిని విస్తృతంగా అమలు చేయాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు.

## న్యాయమూర్తికే 2.5 కోట్లకు టోకరా!

### రాజకీయ పార్టీకి విరాళం పేరిట బురిడీ



బంజారాహిల్స్, ఫిబ్రవరి 27: 'న్యాయమూర్తిగా సుదీర్ఘ కాలం అందించిన సేవలకు సరైన గుర్తింపు ఇప్పిస్తాం..', 'అమెరికాలో స్థిరపడిన మీ పిల్లల భవిష్యత్తుకు ఉపయోగపడే పనులు చేయిస్తాం..', ' కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి బాండ్ల రూపంలో విరాళాలు ఇస్తే మంచి భవిష్యత్తు ఉంటుంది' అంటూ ఓ విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తిని నమ్మించి రూ.2.5 కోట్లు తీసుకొని మోసం చేసిన వ్యక్తులపై ఫిలింనగర్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. ఓయూ కాలనీ సమీపంలోని డ్రీమ్ వ్యాలీలో నివాసం ఉంటున్న జస్టిస్ డీఎస్‌ఆర్ వర్మ ఏపీ, అలహాబాద్ హైకోర్టుల్లో న్యాయమూర్తిగా పనిచేసి పదవీ విరమణ చేశారు. ఆయనకు బంధువుల ద్వారా మూడేండ్ల క్రితం పరిచయమైన నరేంద్రన్ అనే వ్యక్తి 2021లో కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి బాండ్ల రూపంలో విరాళం ఇస్తే అనేక ప్రయోజనాలు చూడవచ్చని చెప్పాడు. తాను ఇవ్వదలచుకున్న మొత్తాన్ని ఆత్మీయ హోమ్స్ అనే నిర్మాణ సంస్థ డైరెక్టర్ కసిరెడ్డి శరత్‌రెడ్డికి ఇవ్వాలని అన్నాడు. నరేంద్రన్ మాటలు నమ్మిన జస్టిస్ వర్మ, భార్యతో పాటు కుమార్తెలు రూ.2.5కోట్ల వరకు కూడబెట్టి.. వారు సూచించిన అకౌంట్లలో జమచేశారు. ఇటీవల రాజకీయ పార్టీలు బాండ్ల రూపంలో సేకరించే విరాళాలు చట్టవిరుద్ధమని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో అప్రమత్తమైన జస్టిస్ వర్మ తాము ఇచ్చిన రూ.2.5కోట్ల విరాళాల గురించి వాకబు చేశారు. నరేంద్రన్ సదరు రాజకీయ పార్టీకి ఆ డబ్బు చెల్లించలేదని, సొంతానికి వాడుకుని మోసం చేశాడని తేలింది. దీంతో నరేంద్రన్, కసిరెడ్డి శరత్‌రెడ్డిలపై చర్యలు తీసుకోవాలంటూ జస్టిస్ డీఎస్‌ఆర్ వర్మ ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు.

## హైకోర్టులో జీపీలు, ఏజీపీల నియామకం

- 55 మందిని నియమిస్తూ న్యాయశాఖ ఉత్తర్వులు

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం తరపున హైకోర్టులో కేసులను వాదించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 11 మంది గవర్నమెంట్ ప్లీడర్లను, 44 మంది అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్లను నియమించింది. ఈ మేరకు న్యాయ శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ న్యాయవాదులు (జీపీలు)గా ఈ రమేశ్ చంద్రగౌడ్, భూక్యా మంగీలాల్ నాయక్, షాజియా పర్వీన్, ఎన్ఎస్ అర్జున్ కుమార్, శాంతి నీలం, బీ మోహనరెడ్డి, మురళీధర్‌రెడ్డి కాట్రాం, ఏ జగన్, శాంతాపూర్ సత్యనారాయణ, గడ్డం వీరాస్వామి, మహేశ్ రాజే నియమితులయ్యారు. ప్రభుత్వ సహాయ న్యాయవాదులు (ఏజీపీలు)గా నియమితులైనవారిలో సైదం లక్ష్మీనారాయణ, బొడ్డు శ్రవణ్ కుమార్, కలగూర శ్రీనివాస్, గీతా తిరందాసు, శిల్పా గెల్లి, జీ ప్రశాంత్, రేలా కృష్ణస్వామి, టీ చైతన్య కిరణ్, సౌరభ్ అగర్వాల్, ఎస్ స్వాతి, ఠాకూర్ నితేందర్‌సింగ్, బబిత, లక్ష్మల సందీప్, ధరావత్ రవి, ఎర్రి రవీందర్‌రెడ్డి, సయ్యద్ ఖదీర్, ప్రొద్దుటూరి రాజీవ్‌రెడ్డి, పత్తిపాక కవిత, కత్రావత్ శంకర్, దల్వాల్ లలిత, హెచ్ రాకేశ్ కుమార్, నాగరాజు గాలి, ప్రసాద్ రావణ బోయినతోపాటు మరికొందరు ఉన్నారు.



సిద్దబోయిన దశరథం (ఫైల్)

## అనారోగ్యంతో సమ్మక్క పూజారి మృతి

తాడ్వాయి, ఫిబ్రవరి 27 : మేడారం సమ్మక్క పూజారి సిద్దబోయిన దశరథం (37) మంగళవారం మృతిచెందారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు వరంగల్‌లోని దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. ఇటీవల జరిగిన మేడారం మహాజాతరలో సమ్మక్క పూజారిగా దశరథం సేవలందించారు. కొద్దిరోజుల క్రితం అతడి సోదరుడు సిద్దబోయిన లక్ష్మణ్‌రావు సైతం అనారోగ్యంతో మృతిచెందారు. ప్రస్తుతం దశరథం సైతం మరణించడంతో మేడారం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పూజారి దశరథం మృతి పట్ల మంత్రి సీతక్క తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



## పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి : ఎంఆర్‌పీఎస్

ఉప్పల్, ఫిబ్రవరి 27: పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని, చెప్పు, డప్పు వృత్తిదారులకు పెన్షన్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏప్రిల్ 13న చలో హైదరాబాద్ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని సుప్రభాత్ హోటల్‌లో యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పొట్టపెంజర రమేశ్ మాదిగ అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్రస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పారిశుద్ధ్య కార్మికులను తక్షణమే పర్మినెంట్ చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు.